సాక్షి వికారాబాద్

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



వేసవి భత్యానికి మంగళం!

ఎండలో పనిచేసే ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేసవి భత్యానికి నాలుగేళ్లుగా బ్రేక్ పడింది. 8లో▸



ఆధ్యాత్మిక చింతన..

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. 8లో▸



అర్హులందరికీ సంక్షేమ..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

బాక్సింగ్‌లో మెరిసిన గిరిజన బిడ్డ

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన నిఖిత



తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన విఠల్‌నాయక్, దేవీబాయ్‌ల కూతురు నిఖిత రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నార్సింగ్ గిరిజన గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 11, 12వ తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగిన అండర్–19 బాలికల విభాగం పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

దరఖాస్తు గడువు పెంచాలి

బంట్వారం: రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల చివరి వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ కోరారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు గడువు ఈ నెల 14తో ముగియనున్నందున చాలా మంది అప్లయ్ చేసుకోలేదని తెలిపారు. నెట్‌వర్క్ సమస్యలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. వరుస సెలవుల కారణంగా చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని గడువు పెంచితే బాగుంటుందని తెలిపారు. ఈ విషయాన్ని తాము ఆయా శాఖల ఉన్నతాధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గడువు పొడిగించాలని ఆయన కోరారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాస్

ధారూరు: మండలంలోని అల్లీపూర్ నుంచి తాండూరు – హైదరాబాద్ ప్రధాన రహదారి వరకు జరుగుతున్న రోడ్డు పనులను సోమవారం పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విశ్రాంత అడిషన్ ఎస్పీ మధుసూదన్‌రావు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రావు తదితరులు

తాండూరు రూరల్: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విశ్రాంత అడిషన్ ఎస్పీ మధుసూదన్ రావు సూచించారు. సోమవారం పెద్దేముల్ మండలం తట్టేపల్లిలో సీనియర్ నాయకుడు ప్రభుకుమార్ తల్లిదండ్రుల(మొగులప్ప, చంద్రమ్మ) జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి చూపకపోవడం బాధాకరమన్నారు. చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, అంజయ్య, నర్సింలు, శంకర్‌నాయక్, లక్ష్మణ్, రాజప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

శంషాబాద్ డీసీపీ రాజేష్

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని శంషాబాద్ డీసీపీ రాజేష్ హెచ్చరించారు. కొందుర్గు పోలీసుస్టేషన్ సోమవారం సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. పీఎస్ రికార్డులు, కేసు ఫైళ్లు, పోలీసు క్వార్టర్స్, పీఎస్‌లో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెట్రోలింగ్ సిబ్బంది 100 డయల్‌కు కాల్ వచ్చిన వెంటనే జాప్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకొని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్సైలు రవీందర్ నాయక్, బాలస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



మర్పల్లి: కోట్ మర్పల్లి గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పులువురు నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పలుచోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో నివాళులర్పిస్తున్న గురునాథ్‌రెడ్డి తదితరులు



అనంతగిరి: వికారాబాద్‌లో నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



పూడూరు: అంబేద్కర్ జయంతిని జరుపుకొంటున్న ఉపాధి కూలీలు

మొబైల్ పోయిందా డోంట్ వర్రీ!

చోరీకి గురైన ఫోన్లను ఇట్టే పట్టేస్తున్న పోలీసులు

ఏడాది క్రితం వరకు చోరీకి గురైన ఫోన్ల రికవరీ పోలీసులకు పెద్ద సవాల్‌గా ఉండేది.. దొంగ దొరికితే తప్ప కేసులు కొలిక్కి వచ్చేవి కాదు.. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు. కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో కేసుల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది.. నేరం చేసిన వారితోపాటు.. చోరీకి గురైన కోట్ల రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్లను సైతం స్వాధీనం చేసుకుంటున్నారు.

- కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో కేసుల్లో పురోగతి
- గడిచిన ఏడాదిలో చోరీకి గురైన మొబైల్ ఫోన్లు 3,647
- స్వాధీనం చేసుకున్నవి 1,250
- వీటి విలువ దాదాపు రూ.2 కోట్లపైనే..



ఇటీవల రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేస్తున్న పోలీసులు

వికారాబాద్: మనిషి జీవితంలో సెల్‌ఫోన్ భాగమైపోయింది. నేడు మొబైల్ ఫోన్ లేని ఇళ్లంటూ లేదు. గ్రామీణ ప్రాంతాలు మొదలుకొని పట్టణాల వరకు వీటి వాడకం భారీగా పెరిగిపోయింది. 90 శాతం మంది స్మార్ట్ ఫోన్లనే వినియోగిస్తున్నారు. ఒక్కో మొబైల్ కోసం రూ.10 వేల నుంచి రూ.లక్షన్నర వరకు వెచ్చిస్తున్నారు. ఇదే సమయంలో ఫోన్ల దొంగతనాలు కూడా ఎక్కువైపోయాయి. ఐదేళ్లుగా పోలీసులు సవాళ్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టాలని భావించిన కేంద్ర టెలీకామ్ మంత్రిత్వ శాఖ నూతన టెక్నాలజీ(సీఈఐఆర్ పోర్టల్)ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా జిల్లా పోలీసు విభాగం మంచి పురోగతి సాధించింది.

భారీగా రికవరీ

గత ఏడాది జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో 3,647 ఫోన్లు చోరీకి గురయ్యాయి. కొన్ని చోట్ల బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా.. మరికొన్ని చోట్ల సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, మోమిన్‌పేట్, కుల్కచర్ల, తుంకిమెట్ల, మర్పల్లి ప్రాంతాల్లో సంతలు నిర్వహించే సమయంలో ఎక్కువగా సెల్ ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో పోలీసులు ఈ ప్రాంతాలను హాట్ స్పాట్లుగా ప్రకటించారు. జిల్లాలో చోరీకి గురైన ఫోన్ల రికవరీ బాధ్యతను ఎస్పీ.. సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. సీఈఐఆర్ టెక్నాలజీని వినియోగించి దాదాపు రూ.2 కోట్ల విలువ చేసే 1,250 సెల్ ఫోన్లను రికవరీ చేశారు.తెలంగాణ జిల్లాలతోపాటు పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని కర్నూల్ జిల్లా డోన్ పట్టణానికి చెందిన కొందరు జిల్లాలో సెల్ ఫోన్లను చోరీ చేస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.దొంగతనాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం మైనర్లేనని పోలీసులు గుర్తించారు.

ఫోన్ పోతే ఏం చేయాలి?

సెల్‌ఫోన్ పోయినా.. చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం మూడు పద్ధతులు ఉంటాయి. బాధితులు తమ ఫోన్ ద్వారా www.ceir.gov.in వెబ్ సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చు. లేదా మీసేవా కేంద్రంలో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఈ రెండూ కాకుండా ఫోన్ ఎక్కడ పోయిందో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఐఎంఈఐ నంబర్, ఫోన్ నంబర్, మొబైల్ కొన్న సమయంలో పొందిన బిల్, అడ్రస్ తదితర వివరాలను ఇందులో పొందుపరచాల్సి ఉంటుంది. మనం ఈ పోర్టల్‌లో నమోదు చేస్తే చోరీకి గురైన ఫోన్ స్టేటస్ చూసుకోవటానికి వీలుంటుంది. దాన్ని ఎవరు.. ఎక్కడ వాడుతున్నారు. అసలు వాడుతున్నారా..? లేదా..? అదే నంబర్‌ను వినియోగిస్తున్నారా..? వేరే నంబర్ వాడుతున్నారా..? లాంటి వివరాలు తెలుసుకునేందుకు వీలుపడుతుంది. పోలీసులు ఈ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారు.

ఎక్కడున్నా దొరికిపోతాయి



సీఈఐఆర్ టెక్నాలజీతో దొంగిలించన ఫోన్లు ఎక్కడున్నా కనిపెట్టవచ్చు. కొందరు చోరీ చేసిన మొబైల్స్‌ను గుర్తించకుండా స్పేర్ పార్ట్స్‌గా మార్చి విక్రయిస్తున్నారు. అయినా దొరికిపోతారు. ఫోన్ ఏ రూపంలో ఉన్నా.. ఎక్కడ ఉన్నా గుర్తించడాని సీఈఐఆర్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుంది. కొంత ఆలస్యం కావచ్చు అంతే..

– నారాయణరెడ్డి, ఎస్పీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

సంక్షేమానికి పెద్దపీట

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వికారాబాద్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వాసుచంద్ర, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్‌టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య

షాద్‌నగర్: విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య అన్నారు. పట్టణంలోని ఎంఆర్సీ భవనంలో సోమవారం సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు అధ్యక్షతన 'పాఠశాల విద్య–ప్రభుత్వ విధానం, మనకర్తవ్యం'అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ–2020) పేద వర్గాలకు నాణ్యమై విద్యను దూరం చేసేవిధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను కేంద్రీకరించేలా, కార్పొరేటీకరణకు అనుకూలంగా ఉందన్నారు. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రతి మండలంలో 4 నుంచి 5 పాఠశాలలను ఎంపిక చేసుకొని ప్రీ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలలు ఒకే దగ్గర ఉండేలా, 6 నుంచి 12వ తరగతి వరకు ఒక క్యాంపస్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సత్యం, రామకృష్ణ, వినీత్, శేఖర్‌గౌడ్, బాలయ్య, జేవీవీ నాయకులు వెంకటరమణ, కుర్మయ్య, సీఐటీయూ నాయకుడు రాజు, టీజీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ, డీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ఎవరికి వారే..

- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో విడివిడిగా పాల్గొన్న మండలి చీఫ్‌విప్, ఎమ్మెల్యే



నారాయణరావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న మహేందర్‌రెడ్డి

బషీరాబాద్: అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్య నేతలు ఎవరికివారే యమునా తీరే అన్న చందగా వ్యవహరించారు. బషీరాబాద్‌లో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి, అయ్యప్ప స్వామి మహాపడి పూజ, ఇతర కార్యక్రమాలకు మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విడివిడిగా హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు నేతలు తమతమ అనుచరులతో వారివారి కార్యక్రమాలను ముగించుకున్నారు. ఇద్దరూ ఒకే పార్టీ నేతలు అయినప్పటికీ వేర్వేరుగా పాల్గొనడంపై పలువురు చర్చించుకున్నారు. ఇద్దరి నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందంటూ సొంత పార్టీ కార్యకర్తలే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ఇంటికి పట్నం మహేందర్‌రెడ్డి వెళ్లి పలకరించారు. దాదాపు 30 నిమిషాలపాటు అక్కడే ఉన్నారు. ఒకే సమయంలో ఇద్దరు నేతలు మండల కేంద్రలో పర్యటించినా ఒకరినొకరు కలుసుకోలేదు. ఎవరి కార్యక్రమాలు వారు ముగించుకొని వెళ్లిపోయారు.

చక్రస్నానం.. తరించిన భక్త జనం

- ముగిసిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు
- చివరిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



గండిపేట చెరువులోకి చక్రస్వామిని తీసుకెళ్తున్న అర్చకులు

మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు సోమవారం చక్రస్నానంతో ముగిశాయి. చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమగుండాల గదిలో పూర్ణాహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా సమర్పించి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకీలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవ పాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవుళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం నిర్వహించారు. చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ చక్రతీర్థాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహన్, కిట్టు, కన్నయ్య, మురళి పాల్గొన్నారు.

దర్శించుకున్న పట్నం మహేందర్‌రెడ్డి

మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకుడు రంగరాజన్ ఆయనకు పూలమాల వేసి స్వామివారి ఆశీర్వాదం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్, నాయకులు భిక్షపతి, బాల్‌రాజ్, శంకర్ తదితరులు ఉన్నారు.

తరలివచ్చిన భక్తజనం

బ్రహ్మోత్సవాల చివరిరోజు పరిసర ప్రాంతాలతో పాటు నగరం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చక్రతీర్థం సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అధికంగా విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధ్వజావరోహణంతో ముగింపు

బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా వస్త్రంపై గరుడ పటాన్ని చిత్రించి ధ్వజస్తంభానికి ఆరోహణం చేసిన వస్త్రాన్ని ముగింపు సూచికగా అవరోహణం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.

క్లుప్తంగా

లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ చైర్మన్ శంకర్, సమితి సభ్యులు

తాండూరు టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో విజేతలకు హనుమాన్ జన్మోత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం బహుమతులు అందజేశారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతిగా హోండా యూనికాన్ బైక్‌ను విజేత గుముడాల సుధాకర్ (నం.9253), ద్వితీయ బహుమతిగా హోండా యాక్టీవాను విష్ణురాం జీకె (నం.6981) స్థానిక స్టేషన్ హనుమాన్ ఆలయ చైర్మన్ మిస్కిన్ శంకర్, నరహరి అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జన్మోత్సవ సమితి సభ్యులు రజినీకాంత్, మహేష్ ఠాకూర్, రామకృష్ణ, పునీత్, భవానీ సింగ్, గురురాజ్, శ్రీనివాస్, ఆనంద్, శివ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రవిగౌడ్‌ను పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామానికి చెందిన ఎల్మకన్నె పీఏసీఎస్ మాజీ చైర్మన్ సంగెం నారాయణగౌడ్ సతీమణి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం నారాయణగౌడ్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంగెం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. అంతియ యాత్రలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, నాయకులు రవీందర్, కేశవరావు, పండరి, సాయిలు, బోయ రాజు, హమీద్ మియా, శ్యామప్ప ,శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దర్గా ఉత్సవాలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కాలె యాదయ్య

నవాబుపేట: మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న సాహెబ్ హుస్సేన్ దర్గా ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతన్నాయి. ఈ ఉత్సవాలకు సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఎండీ రశీ, నాయకులు యాదవరెడ్డి, పాపిరెడ్డి, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభోత్సవం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కెరవెళ్లి గేటువద్ద కాంగ్రెస్ నాయకుడు అలీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, కార్యదర్శి పెంటయ్య, నాయకులు మోహిన్‌పాషా, కరీం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు వ్యవసాయం తెలిసిన భార్యాభర్తలు కావలెను. రూమ్ ఇవ్వబడును. కల్వకుర్తి గట్టు ఇప్పలపల్లి నెలకు జీతం 15వేలు. 7382532031 (HA-1312)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తండాల్లో తాగు నీటికి తండ్లాట



వృథాగా మారిన బోరు

- ఏడాది క్రితం బోరు వేయించిన ప్రభుత్వం
- విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో అధికారుల అలసత్వం
- వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న గిరిజనం

దుద్యాల్: తాగునీటి కోసం గిరిజనులకు తండ్లాట తప్పడం లేదు. ప్రభుత్వం బోరు వేయించినా మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఏడాది నుంచి నిరుపయోగంగా గానే ఉంది. చేసేదేమీ లేక తండావాసులు వ్యవసాయ బోర్ల బాటపడుతున్నారు. మండల పరిధిలోని ముచ్చుకుంట తండా, బోయి నగడ్డ తండాల్లో 500 మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని పలుమార్లు అధికారులను కోరారు. ఇందుకు స్పందించిన అధికారులు రెండు తండాలకు తాగునీరు అందించేందుకుగాను గత ఏడాది జూలైలో బోరు వేయించారు. తదనంత విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అది వృథాగా మారింది. వారానికి రెండు రోజులు మాత్రమే సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు సైతం సరిపడా రావని స్థానికులు వాపోతున్నారు. ఏళ్ల నుంచి తమకు వ్యవసాయ బోర్ల నుంచి నీటి తెచ్చుకోవడం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారు మరమ్మతులు చేయించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని గిరిజనం కోరుతున్నారు.



నీటి కోసం వ్యవసాయ బోరు వద్దకు వచ్చిన గిరిజనులు

వేసవి భత్యానికి మంగళం!

- ఉపాధి కూలీలకు అందని అదనపు డబ్బులు
- నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి
- పని ప్రదేశాల్లో వసతుల కరువు

దోమ: ఎండలో పనిచేసే ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేసవి భత్యానికి నాలుగేళ్లుగా బ్రేక్ పడింది. ప్రభుత్వం గతంలో ఏటా వేసవి భత్యం అందించడంతో పాటు, ఇతర సౌకర్యాలు కల్పించేది. కానీ ప్రస్తుతం అలాంటివేవీ కనిపించడం లేదు. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో భత్యానికి ఈసారి కూడా మంగళం పాడినట్లేనని తెలుస్తోంది.

కొరవడిన స్పష్టత..

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా పల్లె ప్రజలకు స్థానికంగా పని కల్పిస్తూ భరోసా అందిస్తోంది. దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 11,725 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 13,971 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులకు 3,790 మంది కూలీలు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో ఉపాధి హామీ కూలీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి జూన్ నెల వరకు ఐదు నెలల పాటు వారి వేతనానికి అదనంగా 25 నుంచి 30శాతం వేసవి భత్యం చెల్లించేది. కానీ గత నాలుగేళ్లుగా ఇది నిలిచిపోయింది.



బొంపల్లి ఉపాధిహామి పనులు చేస్తున్న కూలీలు

సౌకర్యాల లేమితో ఇబ్బందులు..

గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కరువయ్యాయి. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతుండటంతో మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలు అల్లాడిపోతున్నారు. పని చేస్తున్న చోట కనీసం మంచినీరు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టెంట్లు, అందుబాటులో ఉండటం లేదు. గత ప్రభుత్వాలు కూలీలకు టెంట్లు, మంచి నీరు, గడ్డపారలు, పారలతో పాటు ఇతర పనిముట్లను అందించేంది. కానీ పదేళ్లుగా ప్రభుత్వం ఎలాంటి పరికరాలను అందించడం లేదు. తామే స్వయంగా ఇంటి వద్ద నుంచి పని ముట్లు, నీళ్ల బాటిళ్లు తీసుకుని వెళ్లాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

భత్యం చెల్లించాలి



ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అదనంగా ఇవ్వాల్సిన 25 నుంచి 30 శాతం వేసవి భత్యం నిలిచిపోయింది. దీంతో వేసవి కాలంలో పని గిట్టుబాటు కావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి భత్యం చెల్లించేలా చూడాలి. – కుర్వ లక్ష్మమ్మ, బొంపల్లి

సౌకర్యాలు కల్పించడం లేదు



ఉపాధి పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ కిట్లు, మంచి నీరు, టెంట్లు ఉండటం లేదు. గతంలో పనిముట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం అవి కూడా లేదు. – బండి చిన్నమ్మ, ఊటుపల్లి

స్పష్టత లేదు



వేసవి భత్యం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. గతంలో కూలీలకు రూ.300 చెల్లించేది. ప్రస్తుతం రూ.307 పెంచింది. పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. – దస్తయ్య, ఏపీఓ, దోమ

భూ భారతితో సమస్యలు పరిష్కారం

మండల వ్యవసాయాధికారి తులసి

కొడంగల్: భూ భారతితో సమస్యలు పరిష్కారం అవుతాయని మండల వ్యవసాయాధికారి తులసి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పర్సాపూర్ రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు వీక్షించారు. భూ పరిపాలనలో ఒక నూతన శకానికి నాంది పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూ భారతి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పారదర్శకంగా జవాబుదారీగా అవినీతి రహితంగా సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రైతులకు మేలు

మోమిన్‌పేట: భూ భారతితో రైతులకు మేలు చేకూరుతుందని మర్పల్లి మార్కెటు కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన భూ భారతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో పాలక వర్గ సభ్యులు వీక్షించారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బందుల పాలయ్యారన్నారు. రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతిని ప్రవేశ పెట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, ఏట జయశంకర్, ఏఈఓ పెంటయ్య, శ్రీనివాస్ ఉన్నారు.



మోమిన్‌పేట: భూ భారతి ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న మర్పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



మరికల్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. సోమవారం ఆయన చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ శర్మ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతీ కాలనీకి సీసీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, దామోదర్‌రెడ్డి, నరేందర్, రాజు, వెంకటయ్య, జహంగీర్, నర్సింలు, స్థానిక నాయకులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప

దోమ: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లిలో కాళికామాత జాతర మహోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాంరెడ్డి, ఓబీసీ మోర్చా కన్వీనర్ విజయ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్, నేతలు నరేశ్, నాగేంద్రం, చంద్రశేఖర్, సంతోష్, ధనుంజయ్, ప్రశాంత్, పాల్గొన్నారు.



అమ్మవారి పూజలో పాల్గొన్న ఈశ్వరప్ప

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అజాగ్రత్తగా ఉంటేనే అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వేసవిలో నిప్పుతో అప్రమత్తంగా ఉండాలని, బీడి, సిగరెట్ వంటివి వెలిగించి అలాగే విసరేయరాదన్నారు. వంటిట్లో గ్యాస్ సిలిండర్‌ను అవసరం లేని సమయంలో ఆఫ్ చేసి పెట్టాలన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న అగ్నిప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా అగ్ని మాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు, జాగ్రత్తలపై పలు ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జలంధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని చదును చేసిన వ్యక్తిపై కేసు

రాజేంద్రనగర్: పార్కు స్థలాన్ని చదును చేసిన వ్యక్తిపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పురా భవానీకాలనీలో గతంలో లకన్ సింగ్ అనే వ్యక్తి వెంచర్ చేసి 1000 గజాల పార్కు స్థలాన్ని వదిలారు. కాలనీ ప్రజలు ఈ పార్కు స్థలాన్ని అభివృద్ధి పరుచుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ స్థలం విలువలు పెరిగిపోవడంతో సోమవారం ఉదయం జేసీబీతో లకన్ సింగ్ పార్కు స్థలం వద్దకు వచ్చాడు. జేసీబీతో చదును చేస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు లకన్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని జేసీబీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని మృతదేహం లభించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 25–30 సంవత్సరాలు ఉంటుందని... మృతుడి ఒంటిపై బ్లూ కలర్ ప్యాంట్, బ్లూ కలర్ షర్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులకు కానీ ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

క్రషర్ మెషిన్‌లో పడి కార్మికుడి మృతి

మేడ్చల్‌రూరల్: క్రషర్ మెషిన్‌లో పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనీష్‌సింగ్(27) గిర్మాపూర్‌లోని రోబో సిలికాన్ క్రషర్ మెషిన్‌లో ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున విధుల్లో ఉన్న అతను ప్రమాదవశాత్తు క్రషర్ మెషిన్‌లో పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవులు మృత్యువాత



ఆవుల కళేబరాలు

కుల్కచర్ల: పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన చౌడాపూర్ మండలం టాక్ర్యానాయక్ తండాలో చోటుచేసుకుంది. వివరాలు.. తండాకు చెందిన ముడావత్ పార్వతమ్మ తనకున్న రెండు ఆవులను రోజు మాదిరిగానే పొలంవద్ద కట్టేసి ఇంటికి వచ్చింది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి అకస్మాత్తుగా పిడుగు పడడంతో అవి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

ఇప్పాయిపల్లిలో

కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన గొల్ల రవీందర్ ఇంటి ఎదుట ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగుపడటంతో మంటలు చెలరేగాయి. పైభాగంగా పూర్తిగా కాళిపోయింది. పచ్చనిచెట్టు మంటలు చెలరేగి కొమ్మలు బొగ్గులుగా కిందపడుతుండడంతో ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



ఇప్పాయిపల్లిలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో ఎగిసిపడుతున్న మంటలు

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అగ్ని ప్రమాదాలపై అందరు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, రఘు నాయక్, మంగులాల్ నాయక్, కరుణాకర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



ఫార్మా గ్రామాల్లో వడగండ్ల వాన



యాచారంలో వడగండ్లు చూపుతున్న దృశ్యం

ఈదురు గాలులు.. వడగళ్ల వాన

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఫార్మా గ్రామాలతో పాటు యాచారంలో ఈదురు గాలులతో కూడిన వర్షం దానికి తోడు వడగండ్లు పడటంతో పంటచేలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మామిడి కాయలు రాలిపోయాయి.